విశాలాంధ్ర అనకాపల్లి
ఆదివారం 23, జూన్ 2024

అయ్యన్న స్పీకర్ కావడంతో బాణాసంచా పేల్చిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - గొలుగొండ : కోస్తాంధ్ర టైగర్ నర్సీపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ స్పీకర్గా నియ మించడంతో మండలంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంబరాలు చేశారు. మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో బాణా సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుండి స్పీకర్గా ఎన్నిక కాబడిన చింతకాయల అయ్యన్న పాత్రుడు మొదట వ్యక్తి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిటికెల సాంబమూర్తి పారుపల్లి నాగేశ్వరరావు కొమరోలు చిట్టిబాబు పుల్లేటికుర్తి రమేష్ గండేపల్లి రాము తెలుగుదేశం జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యను వ్యాపారంగా మారుస్తున్న...

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాల నడుపుతూ పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భాష్యం పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. పాఠశాలల యాజమాన్యం దోపిడీకి, సహకరిస్తున్న విద్యాశాఖ అధికారుల తీరుపై నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర కుమార్ మాట్లా డుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రభుత్వ నిబంధన వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు యూనిఫామ్లు అమ్ముతున్నారు. దీనిపైన విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోవడంతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భాష్యం పాఠశాలలో విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలను బయటకు తీసుకువచ్చి నిరసన తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి చిట్టిబాబు, కోటేశ్వరరావు రావడంతో అక్కడున్న పాఠ్య పుస్తకాలను సిస్ చేసి పాఠశాలపై చర్యలు తీసుకోమని అడగగా పాఠ్యపుస్తకాలను తమ కార్యాలయానికి తీసుకువెళ్లి డీఈవో వెంకట లక్ష్మమ్మకి రిపోర్ట్ పంపించి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారి కి కూడా అనేకసార్లు ఫిర్యాదు చేసిన ఆవిడ ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు తప్ప ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై తనిఖీలు చేసి వాటిపైన చర్యలు తీసుకున్న సందర్భాలు కనిపించట్లేదు. జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ఈ రకంగా విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలకు కొమ్ము కాయడం చాలా సిగ్గుచేటని ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధి కారులు ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దందాపై చర్యలు తీసుకోక పోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించడానికి శ్రీకారం చుడతామని ఏఐఎస్ఎఫ్గా హెచ్చరిక జారీ చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, తాతాజీ, రాకేష్, సంపత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా నీట్ పరీక్ష మరలా నిర్వహించాలి

పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయం విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు పై విచారణ జరిపించాలి అని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ. నీట్ పరిక్ష పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్డిఏ సంకీర్ణ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుంది. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వం, చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఎ)లకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారు. ఎన్టిఎను మెరుగు పర్చాల్సి ఉందని చెప్పుకొచ్చారు. అంతేతప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తామనికాని, అభ్యర్థులకు ఏవిధమైన న్యాయం చేస్తామనికాని తెలపలేదు. నీట్లో అక్రమాలు అవేవో సాధా రణంగా చోటు చేసుకున్న చిన్న తప్పులన్నట్లు పేర్కొన్నారుతప్ప కించిత్తు పశ్చాత్తాపం వ్యక్తీకరించలేదు. మంత్రి నుంచి ఇన్నాళ్లకు వెలువడిన పేలవమైన స్పందనబట్టి నీట్ స్కాంను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కేందుకు తయారుగా ఉందని అర్థమవుతుంది. నీట్లో అవకతవకలే జరగలేదని కేంద్రం చెబుతూ వచ్చింది. బిజెపి ఏలుబడిలోని గుజరాత్లో అవకతకలు జరిగాయని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఒక్కసారిగా అక్రమాల పుట్ట పగిలినట్లయింది. ప్రైవేటు కోచింగ్ సెంటర్ల, ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ కూడా చేశారు. మరోవైపు ఎన్డిఎ పాలనలోని బీహార్లో ప్రత్యేకంగా సిట్ను వేసి దర్యాప్తు చేయిస్తున్నారు. ఇప్పటికి 13 మందిని అరెస్ట్ చేశారు. వారిలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్కు చెందిన వారూ ఉన్నారు. దీన్నిబట్టి చూస్తుంటే బిజెపి, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల కేంద్రంగా నీట్ స్కాం విస్తరించినట్లు అర్థమవుతోంది. గతంలో మధ్యప్రదేశ్లో శివ్రాజ్సింగ్ ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకాల్లో జరిగిన వ్యాపం కుంభకోణం గుర్తుకొస్తోంది. కాగా కోర్టుల్లో విచారణ సందర్భంగా వెల్లడవుతున్న 'నీట్' అక్రమాలు అందరినీ నివ్వెర పరుస్తున్నాయి. 67 మంది అభ్యర్థులకు 720 మార్కులొచ్చాయి. వారిలో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన అరుగురు ఉన్నారు. ఒఎంఆర్ షీట్లలో ఒక విధంగా స్కోరింగ్ కార్డుల్లో మరొక విధంగా మార్కులొచ్చాయి. అనూహ్యమైన రీతిలో కటాఫ్ మార్కులు, సగటు మార్కులు పెరిగాయి. ఈ అక్రమాలు మచ్చుకు మాత్రమే. నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరిపిస్తే మరెన్నో అక్రమాలు వెలుగు చూడొచ్చు. వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా ఒకే ఎంట్రన్స్ టెస్ట్ ఉండాలంటూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ను 2019లో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చింది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను ప్రవేశపెట్టింది. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో నీట్ సరైనది కాదని పలు రాష్ట్రాలు అభ్యంతరం పెట్టాయి. సామాజిక న్యాయానికి, అభ్యర్థులకు, పేదలకు, గ్రామీణ విద్యార్థులకు నష్టమన్న ఆందోళనలు బలంగా వ్యక్తమయ్యాయి. ప్రైవేటు కోచింగ్ సెంటర్ల దోపిడీకి అవకాశం ఇవ్వడమేనన్న విమర్శలూ వచ్చాయి. అయినా బిజెపి సర్కారు పెడచెవినపెట్టి తాను అనుకున్నది చేసింది. ఆచరణలో ఆ ఆందోళనలన్నీ నిజమయ్యాయి. ఎన్టిఎ పనితీరు లోపభూయిష్టంగా తయారైందని పేపర్లీక్, ఇతర అవకతవకలు, అక్రమాలు స్పష్టం చేస్తున్నాయి. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షను 24 లక్షల మంది రాశారు. వారి భవిత అగమ్యగోచరం కావడం బాధాకరం. సుప్రీం, లేదా హైకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపిస్తేనే కుంభకోణం, దానితో సంబంధం ఉన్న వారి గుట్టు రట్టవుతుంది. కనీసం న్యాయస్థానం నియమించిన వారితోనైనా విచారణ జరిపిస్తే న్యాయం న్యాయం జరిగే వీలుంది. సిబిఐ అంటే, ఈ మధ్య కాలంలో ఆ సంస్థను మోడీ సర్కారు ఏ విధంగా ఆడిస్తున్నదీ చూస్తున్నాం. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా సర్వోన్నత న్యాయస్థానానికి నిజం చెప్పి సమగ్ర దర్యాప్తునకు ముందుకు రావడం బాధ్యత అనిపించుకుటుంది.తక్షణమే నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలి అనీ, రాష్ట్రాల హక్కులు స్వయంప్రాతిపత్తిని కాపాడాలి.పరిక్షల నిర్వహణ నుంచి ఎన్ టి ఏ ను తప్పించాలని,పరిక్షల పేరుతో విద్యను కేంద్రీకరించడం ఆపాలి అనీ, కేంద్రం ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని భాదిత విద్యార్థులకు న్యాయం విచారణ జరిపించాలి అనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ జిల్లా కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

జిల్లా రెవిన్యూ అధికారి దయానిధి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఈ నెల 24 సోమవారం ఉదయం 10 గంటల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్య క్రమానికి బదులుగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టమ్) ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యల పరిష్కార కోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చేవారికి త్రాగేందుకు మంచినీరు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వికలాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని జిల్లా రెవెన్యూ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - పాయకరావుపేట : పాయకరావు పేట ఎమ్మెల్యేగా వంగల పూడి అనిత గెలుపొంది, హోం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పాయకరావుపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్య క్రమాన్ని టిడిపి మండల అధ్య క్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ప్రారంభించారు. సుమారు 1000 మంది అన్నదాన కార్య క్రమంలో పాల్గొన్నారు. సలికే చిన వెంకట రమణ ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో చింతకాయల రాంబాబు, లెక్కల గోవింద నాయుడు, జూరెడ్డి ప్రసాద్, పల్లా విలియం కేరి, తుమ్మలపల్లి లక్ష్మణరావు, సలికే గోవిందరావు, ఆరుగుల అప్పలకొండ, తుమ్మలపల్లి కుమార్, ఇందుగుపల్లి రమణ, మంజూలూరి దుర్గా ప్రసాద్, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే జైలు, జరిమానా

విశాలాంధ్ర - చోడవరం : ప్రభుత్వ పరీక్ష పేపర్లు లీకేజీల ఆందోళ నలతో, బాధ్యు లపై చర్యలకు " పబ్లిక్ ఎగ్జా మినేషన్ (అక్ర మాకు నియంత్రణ) పేరుతో చట్టం - 2024 పేరుతో కేంద్రం ప్రభుత్వం గెజిట్ రిలీజ్ చేసింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ పరీక్షల్లో ఎవ్వరైనా ఆక్రమాలకు పాల్పడితే కనిష్టంగా 3 - 5 ఏళ్ల జైలు శిక్ష, వ్యవస్థీకృత మోసాలకు పాల్పడితే 5 - 10 ఏళ్ల జైలు శిక్ష తో బాటు కోటి రూపాయలు వరకు జరిమానా విధించ వచ్చును. దీంతో పరీక్ష పేపర్లు "లీకు" వీరుల్లో వణుకు మొదలైంది.

చింత చెట్టు కూలి కారు ధ్వంసం

విశాలాంధ్ర - గొలుగొండ : గొలుగొండ మండలం గైరంపేట గ్రామానికి చెందిన అబ్రహం తన ఇంటి వద్ద కారు నిలపడంతో శుక్రవారం రాత్రి కురిసినభారీ వర్షానికి చింతచెట్టు కూలిపోయి కారుపై పడడంతో ధ్వంసం తీవ్రంగా నష్టపోయారు ఈదురు గాలులతో ఎడతెరిపిలేని వర్షం కారణంగా ఈ చింత చెట్టు కూలిపోవడంతో ఈ సంఘటనచోటు చేసుకుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన కారును తీసేందుకు చింత చెట్టు తొలగించి ద్వశమైన కారును బయటకు తీశారు.

ఆటోమేటిక్ డోర్ లాక్ పరికరం తయారు చేసిన విద్యార్థినిలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జిల్లా కేంద్రంలో గల డైట్ (అటానమస్) కళాశాల డిప్లొమా విద్యార్థినిలుఆటోమాటిక్ గా డోర్ లాక్ అయ్యే పరికరాన్ని తయారు చేసి నట్లు ప్రిన్సిపల్ డా..ఆర్.వైకుంఠరావు తెలి పారు. ఈ పరికరం ద్వారా ఎవరైనా డోర్ దగ్గరకు రాగానే లాక్ ఓపెన్ అయ్యి రూంలోకి వెళ్ళగానే దానంతట అదే డోర్ లాక్ చేసు కుంటుందని విద్యార్థినులు పి.ప్రవల్లిక, పి.జ్యోతిక, జి.జాహ్నవి, జి.చంద్రకళ, ఎస్.అఖిల తెలిపారు. దీనికీ ప్రత్యేకం గా అమర్చిన సెన్సార్ ద్వారా డోర్ దగ్గరకు రాగానే సెన్స్ యాక్టివేట్ అయ్యి డోర్ లాక్ ఓపెన్ మరియు క్లోజ్ ఆటోమేటిక్ గా జరుగుతుంది అని విద్యార్థినులు తెలిపారు. ఈ ప్రోజెక్ట్ చేయడానికి,సెన్సార్,స్విచ్చింగ్ సర్క్యూట్, పవర్ సప్లయ్, సౌండ్ సెన్సార్ వాడినట్లు విద్యార్థినులు తెలిపారు. ఎప్పుడైనా డోర్ లాక్ ఓపెన్ అయ్యినపుడు బీప్ సౌండ్ ద్వారా మనల్ని అప్రమత్తం చేస్తుందని ప్రోజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరి రావు తెలిపారు.ఈ ప్రోజెక్ట్ చేయడానికి 600రూపాయలు ఖర్చు చేసినట్లు డిప్లొమా కోఆర్డినేటర్ సరిత రాణి పండా తెలిపారు.కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు సరికొత్త పరిశోధనలు చేస్తూ నేటి సమాజానికి ఉపయోగపడే విధంగా పరికరాన్ని తయారు చేసారు అని విద్యార్థులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గా శ్యామ్ ప్రసాద్ డిపార్ట్మెంట్ ఈ.సి.ఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ విద్యార్థులను అభినందించారు.

మా భూములు రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇవ్వండి

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన రైతు మట్ట సత్యనారాయణ ఉగ్గినపాలెం రెవెన్యూ పట్టా నెంబర్ 1170 సర్వే నెంబర్ 260 / 11/16 లో సుమారు ఎకరా1. 45 సెంట్లు భూమి కలదు. మరో సర్వే నెంబరు 259/6 / 8.లో 24 సెంట్లు భూమి కలదు. తాసిల్దార్ కార్యాలయం వారు ఆన్లైన్ చేసిన రిజిస్టర్ ఆఫీస్కు భూ అమ్మకాలకు అనుమతులు పంపించలేదు. రిజిస్టర్ ను సంప్రదించగా మాకు ఎటువంటి అనుమతులు రాలేదని అన్నారు. ఉగ్గినిపాలెం రైతులు భూముల అమ్ముకుందామన్న అమ్మడానికి వీలు లేని విధంగా రెవెన్యూ వారు ఇబ్బంది పెడుతున్నారని ఆవేద వ్యక్తి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం ఉన్నందువల్ల చట్టాన్ని అడ్డం పెట్టుకొని రెవెన్యూ వారు కాలయాపన చేస్తున్నారు. మా అవసరాలు నిమిత్తం మా భూమి అమ్ముకోలేకపోతున్నామని ఆ భూమిపై అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేక పోతున్నామని చాలా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఆ భూములు అమ్మకాలు కొనుగోలు జరగకపోవడం వలన ఆ సర్వే పరిధిలోని భూముగల ప్రతి రైతు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ మే రెవెన్యూ అధికారులు మా భూముల ఉన్నట్టు,అమ్మకాలు కొనుగోలుకు సద రిజిస్టర్ కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.

అధికార ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆశలు నెరవేర్చాలి

విశాలాంధ్ర - చోడవరం : రాష్ట్రంలో అధికార తెలుగుదేశం నేతృత్వంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారానికి, ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా కృషిచేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీ.పీ.ఎం) రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్. శర్మ అన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో నిర్వ హిస్తున్న రెండు రోజుల జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించి, మాట్లా డారు. సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న అధ్యక్షతన జరుగుతున్న నిర్వ హిస్తున్న తరగతుల్లో చోడవరం ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని తెలియజేసారు. ప్రధానంగా గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీ ఆధునీకరణ, రైతుల బకాయిలు, శిధిలమైన రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జి వంటి అనేక మౌలిక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి పాలక వర్గాలు కృషిచేయాలని కోరారు. రాష్ట్రంలో తిరిగి అధికారం చేజిక్కించుకున్న టి.డి.పి. ప్రభుత్వం పై ప్రజలు అనేక అశలు పెట్టుకున్నారని వాటికి అనుగుణంగా పాలన అందించాలని కోరారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ప్రజా పోరాటాలు నిర్వహించడానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతులకు పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న, జి. కోటేశ్వరరావు, వి.వి శ్రీనివాస రావు, ఆర్.శంకరరావు, ఎస్.వి నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల వారు పాల్గొన్నారు.

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - కె కోటపాడు : వర్షాకాలంలో వచ్చే అతిసారం డయేరియా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక ఎంపీడీవో పట్నాయక్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అంగన్వాడి, ఇంజనీరింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడారు.గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేపట్టాలన్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీటి శాంపుల్స్ను ప్రతి వారం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ బ్లీచింగ్ చల్లాలన్నారు. గ్రామాల్లో ఉన్న ఇంజనీరింగ్ సహాయకులు ప్రతిరోజు తనిఖీలు నిర్వహించాలని ఈ సమావేశంలో ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జూలై 1 నుండి ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేట నిషేధం ముగిసిన మత్స్యకార భరోసా పంపిణీ లేదు

వైసీపీ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపిల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - పాయకరావుపేట : మత్స్యకారులు సముద్రంలో వేట నిషేధం ముగిసినా నేటికీ మత్స్యకార భరోసా అందలేదని వైసిపి రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపిల్లి శ్రీనివాస్ ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో మత్స్యకార భరోసా మే నెలలో పంపిణీ చేసేవారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకార భరోసా పంపిణీ చేయలేదన్నారు. రాష్ట్రంలో 1,23,519 మంది మత్స్యకారులు, అనకాపల్లి జిల్లాలో సుమారు 40 వేల మంది, పాయకరావుపేట నియోజక వర్గంలో 13 వేల మంది, వెంకటనగరంలో సుమారు 1000 మంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా అందవలసి ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో ఒక్కొక్క మత్స్యకారులకు మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు అందించే వారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే భరోసాను రూ. 20 వేలు అందిస్తామని ప్రకటించి నేటికీ పంపిణీ చేయలేదన్నారు. సముద్రంలో వేటలేక, భరోసా అందక మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మత్స్యకార భరోసా అందించాలని, అలాగే రాయితీ డీజిల్ ఇచ్చే బంకులు వివరాలు తెలియజేయాలని చోడిపిల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో ఈవోపీఆర్డి చంద్రశేఖర్ సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పన్నులు వసూలు చేయాలని, ఉపాధి హామీ పనులు, తాగునీటి సమస్యలు, పారిశుధ్యం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, వై. సత్యనారాయణ, నరేష్, మల్లికార్జున చారి, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం : మలేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు అనకాపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇటంసెట్టి శ్రీనివాసరావు అన్నారు . శనివారం అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పర్యవేక్షణలో కేజీబీవీ హాస్టల్, ఏపీ ఆర్ హాస్టల్, బాయ్స్ హాస్టల్, పూడిమడక హాస్టల్లలో దోమల నివారణకు ఏఎస్ఎం (5 శాతం) మందును స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమ కాటు వలన వస్తుందని, దోమలు నీటినిల్వ ఉన్న ప్రదేశంలోసంతానోత్పత్తిని చేస్తుం దన్నారు. పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చేసు కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ సి వైద్యాధికారిణి కె.శ్రావ్యా, సిహెచ్ ఓ వేణుగోపాల్, హెల్త్ సూపర్వైజర్ పి.సన్యాసిరావు హెల్త్ అసిస్టెంట్ లండా అప్పలకొండ, ఆశ వర్కర్ల డి.సరోజినీ, ఎన్ సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయాలు పాటించలేని జగన్ రెడ్డి : బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : అసెంబ్లీ స్పీకర్గా బీసీ సామాజిక వర్గానికి చెందిన చింతకాయల అయ్యన్నపాత్రుడును తెలుగుదేశం పార్టీ ఎన్నిక చేయడంతో సభ సాంప్రదాయాలు పాటిస్తానని నిన్న ప్రమాణం చేసి 24 గంటలు కాకుండానే సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చి సభకు గైర్హాజర్ అవ్వడం బీసీలు పట్ల జగన్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని దానికి స్పీకర్ ఎన్నిక నిదర్శనమని మాజీ శాసనమండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి చర్యల పట్ల ఘాటుగా విమర్శలు చేశారు. జగన్ రెడ్డి ముందు నుంచి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని వైసీపీ పాలనలో వివిధ వర్గాలకు 56 కార్పొరేషన్లు పెట్టి వారికి నిధులు విధులు ఇవ్వకుండా పెత్తందారుల పాలన కొనసాగించారని, మరో ఉదాహరణ వైసిపి రాష్ట్ర కమిటీ చూసినట్లయితే మొత్తం రెడ్డి సామాజిక వర్గంతో నిండిపోయిందని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పదవుల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన పోస్టులన్నీ తన సామాజిక వర్గం వారి కేటాయించి, ప్రాధాన్యత లేని వాటికి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు ఇచ్చే వారని, పేరుకు పేదలకు ప్రతినిధిగా చెప్పుకుంటున్న జగన్ రెడ్డి చేతలలో కాంట్రాక్టులు, మద్యం, ఇసుక, గనులు, గ్రావెల్, మట్టి వంటి అన్నీ కూడా దోచుకోవడానికి తన సామాజిక వర్గాల వారికే లైసెన్సులు ఇచ్చేసారని నాగ జగదీష్ మండిపడ్డారు. ప్రజా తీర్పును గౌరవించకుండా ఓట్లు వేసిన ప్రజలను అవమాన పరుస్తూ మాట్లాడడం తగదని, 40 శాతం ప్రజలు నా వెంటే ఉన్నారని అంటూ విర్రవీగుతూ 2029 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సింగిల్ డిజిట్ వస్తుందని జగన్ రెడ్డి ఇంకా అహంకార ధోరణి పోలేదని ఇప్పటికే 60 శాతం ప్రజలు జగన్ రెడ్డిని ఇంటికి సాగనంపిన పశ్చాత్తాపం బుద్ధి రాలేదని నాగ జగదీష్ అన్నారు. అనకాపల్లి నియోజక వర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన వారికోసం కొత్తూరు నర్సింగరావుపేటలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాపు సామాజిక భవనానికి కేటాయించిన స్థలములో ఎటువంటి అనుమతులు లేకుండా వైసిపి కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని, దానిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, జీవీఎంసీ ప్రధాన కమిషనర్ ఇటువంటి అనుమతులు లేని భవనాల నిర్మాణాలు జరుగుతుంటే తనకి ఏమీ పట్టనట్టు వ్యవహరించారని, జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తూ దానికి సహకరించిన వారందరి పైన చర్యలు చేపట్టాలని, జీవీఎంసీ నిధులు ఒక పార్టీ కార్యాలయానికి ఏ విధంగా కేటాయించారో తెలపాలని నాగ జగదీష్ డిమాండ్ చేశారు.